ajea.in
sakshitha.in
sakshithanews.com
epaper.sakshithanews.com
tejanews.com
tejanews.co.in

# సాక్షిత

తెలుగు దినపత్రిక

www.sakshithanews.com

AJEA
ALL JOURNALISTS & EDITORS ASSOCIATION

మేడ్చల్ | సంపుటి : 9 | సంచిక : 359 | పేజీలు : 8 | శనివారం మార్చ్ 14 2026 | వెల రూ. 5.00/-


## అసోం నుంచి తెలుగు రాష్ట్రాలను అనుసంధానించే అమృత్ భారత్ రైలు ప్రారంభం



అసోం, రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానించే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ రైలును ప్రధాని అసోంలో ప్రారంభించారు. అసోంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కామాఖ్య, చర్లపల్లి మధ్య స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లతో ఈ రైలు సేవలు అందించనుంది. దీనితో ఈశాన్య ప్రాంతాల వైపు వెళ్లే ప్రయాణికులకు తక్కువ ఛార్జీలతో సౌకర్యవంతమైన ప్రయాణం సాధ్యమవుతుంది. ఈ రైలు మార్గమధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం జంక్షన్, పెందుర్తి, దువ్వాడ, సామర్లకోట జంక్షన్, రాజమహేంద్రవరం, తణుకు, భీమవరం పట్టణం, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నల్గొండ స్టేషన్లలో ఆగుతూ, అక్కడి నుంచి చర్లపల్లికి చేరుకుంటుంది.

# చందానగర్‌లో భారీ అగ్నిప్రమాదం.. దగ్ధమైన అను ఫర్నిచర్ షోరూం

నగరంలోని చందానగర్‌లో గురువారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఇక్కడి ప్రధాన రహదారిపై ఉన్న ప్రముఖ 'అను ఫర్నిచర్' షోరూంలో మంటలు చెలరేగి, ఐదు అంతస్తుల్లోని ఫర్నిచర్ మొత్తం కాలి బూడిదైంది. ఈ ఘటనలో కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో షోరూం నుంచి మంటలు రావడం గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారమిచ్చారు. షోరూంలో చెక్క, కుషన్లు వంటి తేలికగా మండే వస్తువులు అధికంగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. చూస్తుండగానే ఐదు అంతస్తుల భవనం మొత్తం అగ్నికీలల్లో చిక్కుకుంది. దట్టమైన పొగ కమ్ముకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైర్ ఇంజన్లతో వెంటనే ఘటనాస్థలికి చేరుకుని, మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. అయితే, అప్పటికే షోరూంలోని ఫర్నిచర్ పూర్తిగా దగ్ధమైంది. షోరూం జాతీయ రహదారి పక్కనే ఉండటంతో సహాయక చర్యల సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు వాహనాలను వేరే మార్గాల్లో మళ్లించారు. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



## పశ్చిమాసియా ఉద్రిక్తతల ఎఫెక్ట్.. గ్యాస్ గోడౌన్ల వద్ద బారులు

ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎల్పీజీ కొరత వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే బెంగళూరు, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ తదితర నగరాల్లో వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా హోటళ్లు, రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడ్డాయి. వంట గ్యాస్ కొరత కారణంగా గృహ వినియోగదారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంట గ్యాస్ ఇళ్ల వరకు రావడానికి రోజుల సమయం పడుతుండటంతో వినియోగదారులు వివిధ ప్రాంతాల్లో గ్యాస్ గోడౌన్ల వద్దకు వచ్చి క్యూ కడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో, జనగాం జిల్లా రఘునాథపల్లిలో వంట గ్యాస్ కోసం ప్రజలు సిలిండర్లతో బారులు తీరారు. మూడు రోజుల క్రితం గ్యాస్ బుక్ చేసుకున్నప్పటికీ రాలేదని వరుసలో నిలబడిన వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



## రేవంత్ రెడ్డి బినామీ కంపెనీపై కేసులను ప్రభుత్వం తారుమారు చేసింది: అమిత్ షాకు కేటీఆర్ లేఖ



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బినామీ కంపెనీ కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్‌పై కేసులను ప్రభుత్వం తారుమారు చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి బినామీ వ్యాపారాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు కేటీఆర్ లేఖ రాశారు. ఈ లేఖ ప్రతులను కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, అర్జున్ రామ్ మేఘవాల్‌లకు కూడా పంపించారు. తెలంగాణలో శాంతిభద్రతలు దిగజారాయని ఆ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. కేఎల్ఎస్ఆర్

## గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రానిదే బాధ్యత... సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు: పొన్నం ప్రభాకర్



ప్రస్తుతం నెలకొన్న గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో నెలకొన్న గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రానిదే పూర్తి బాధ్యతని, అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలో కేంద్రం తక్షణమే స్పందించి సరఫరాను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఈ కొరతపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని, వారు తమ బాధ్యతను విస్మరిస్తున్నారని విమర్శించారు. మూసీ నదిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ఒక స్పష్టమైన

## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర (82) కన్నుమూశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ఇవాళ విషమించడంతో, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. హెచ్ జే దొర కొంతకాలంగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారు. ఆయన క్రమం తప్పకుండా డయాలసిస్



# ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ...

### రాష్ట్రంలో భారీగా భూ కేటాయింపులు...

### పరిశ్రమలు, విద్యాలయాలకు పెద్దపీట



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జల జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం, కడప స్టీల్ ప్లాంట్‌కు భూ కేటాయింపులు, గిరిజన రైతులకు సబ్సిడీలు, మహిళల కోసం హాస్టళ్లు వంటి అనేక ముఖ్యమైన ప్రతిపాదనలను ఆమోదించారు. సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.

**భూ కేటాయింపులపై కీలక నిర్ణయాలు**

రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు పరిధిలోని పలు గ్రామాల్లో 424.45 ఎకరాల ప్రభుత్వ భూమిని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థకు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.21.30 కోట్ల చెల్లింపుపై ఈ భూమిని ఏపీఐఐసీకి బదలాయించనున్నారు. రెండేళ్లలో ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వీటితో పాటు కిమ్స్ ఆసుపత్రికి 2 ఎకరాలు, సంబంధిత ట్రస్టుకు 23 ఎకరాలు, తుళ్లూరు ఎడ్యుకేషన్ సొసైటీకి 3 ఎకరాలు పరిహారంగా కేటాయించారు. బాపట్ల జిల్లాలో లగ్జరీ రిసార్టుల కోసం ఏపీ టూరిజం అథారిటీకి 17 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో పర్యాటక అభివృద్ధికి 20 ఎకరాలు, నెల్లూరులో ఈఎస్ఐసీ ఆసుపత్రి నిర్మాణానికి ఎకరం భూమిని కేటాయించారు. ముత్తుకూరులో సింగపూర్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.20 కోట్లతో నిర్మించనున్న ఆసుపత్రి కోసం 86 సెంట్ల భూమిని నామమాత్రపు ధరకు ఇచ్చేందుకు నిర్ణయించారు.

## ఏపీఎస్పీ సిబ్బందికి ప్రమోషన్లు... మంత్రి నారా లోకేశ్ చొరవతో 300 కుటుంబాల్లో ఆనందం

ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ (ఏపీఎస్పీ) విభాగంలో ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న హెడ్ కానిస్టేబుళ్ల నిరీక్షణ ఫలించింది. కూటమి ప్రభుత్వం ఏకకాలంలో 300 మంది హెడ్ కానిస్టేబుళ్లకు అసిస్టెంట్ రిజర్వ్ సబ్-ఇన్‌స్పెక్టర్లు (ఏఆర్ఎస్ఐ)గా పదోన్నతులు కల్పిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో ఈ ప్రక్రియ పూర్తి కావడం గమనార్హం. కొంతకాలంగా పదోన్నతులు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్న ఏపీఎస్పీ హెడ్ కానిస్టేబుళ్లు ఇటీవల ప్రజాదర్బార్‌లో మంత్రి నారా లోకేశ్ ను కలిశారు. తమ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారంలో చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సమస్య ఏదైనా



సాక్షిత

తెలుగు దినపత్రిక

## రేవంత్ రెడ్డి బినామీ కంపెనీపై కేసులను ప్రభుత్వం తారుమారు చేసింది: అమిత్ షాకు కేటీఆర్ లేఖ

(మొదటి పేజీ తరువాయి)

సంస్థపై కేసులు నమోదు కాగా, విచారణ వేళ ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రభుత్వం సాక్ష్యాధారాలను తారుమారు చేసిందని ఆరోపించారు. సాక్ష్యాలు పోయాయని చెప్పడం దారుణమని అన్నారు. అధికారులపై ముఖ్యమంత్రి ఒత్తిడి తెచ్చి సాక్ష్యాలను మాయం చేయించారని మండిపడ్డారు.రాష్ట్రంలో విచారణ సంస్థలు, పోలీసులను నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయే పరిస్థితి వచ్చిందని అన్నారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీ దివాలా తీసినా రేవంత్ రెడ్డి కాంట్రాక్టులు కేటాయించడం సరికాదని అన్నారు. ఈ సంస్థపై విచారణ జరగాలని, అది నిష్పక్షపాతంగా జరగాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర ఏజెన్సీలు విచారణ చేయాలని సుప్రీంకోర్టు సూచించినా రాష్ట్రం పట్టించుకోలేదని అన్నారు.

## ఏపీఎస్పీ సిబ్బందికి ప్రమోషన్లు... మంత్రి నారా లోకేశ్ చొరవతో 300 కుటుంబాల్లో ఆనందం

(మొదటి పేజీ తరువాయి)

తన దృష్టికి తీసుకువస్తే అండగా ఉంటానని భరోసా ఇచ్చిన లోకేశ్, వారి వినతిపై సానుకూలంగా స్పందించారు. ఇచ్చిన మాట ప్రకారం, సంబంధిత ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపి పదోన్నతుల ఫైల్‌ను వేగంగా ముందుకు కదిలించారు.వాస్తవానికి 2014-19 మధ్య కాలంలోనే సివిల్, ఏఆర్ విభాగాలతో పాటు ఏపీఎస్పీ సిబ్బందికి కూడా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వం భావించింది. అయితే, కొన్ని సాంకేతిక కారణాలు, ఆ తర్వాత ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో ఏపీఎస్పీ సిబ్బంది ప్రమోషన్ల ప్రక్రియ నిలిచిపోయింది. గడిచిన ఐదేళ్లలో గత ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించుకున్నా ఎలాంటి స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే సిబ్బంది మంత్రి లోకేశ్ ను ఆశ్రయించారు.మంత్రి లోకేశ్ చూపిన చొరవతో తమ చిరకాల వాంఛ నెరవేరడంతో సుమారు 300 కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. సమస్యను త్వరితగతిన పరిష్కరించి, తమకు అండగా నిలిచిన మంత్రి లోకేశ్ కు ఏపీఎస్పీ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

చేయించుకుంటున్నారు. ఇవాళ ఉదయం హైదరాబాద్ లోని నిమ్స్ లో డయాలసిస్ చేయించుకుని ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత ఆయన బాత్రూంలో పడిపోయినట్టు తెలుస్తోంది. హెచ్‌జే దొర తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు నిమ్స్ కు తరలించారు. అత్యవసర చికిత్స అందించినప్పటికీ డాక్టర్ల ప్రయత్నాలు ఫలించలేదు.



1965 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన హెచ్‌జే దొర శ్రీకాకుళం జిల్లాకు చెందినవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీజీపీగా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఆయన విశేష సేవలు అందించారు. ముఖ్యంగా, రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదాన్ని (నక్సలిజం) అణచివేయడంలో కీలక పాత్ర పోషించి గుర్తింపు పొందారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌గా, సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌గానూ జాతీయ స్థాయిలో పలు ఉన్నత పదవులు చేపట్టారు. దొర 1996లో డీజీపీగా ప్రమోషన్ పొందారు. ఆయన తన సుదీర్ఘ వృత్తి జీవితానుభవాలతో 'జర్నీ త్రూ టర్బ్యులెంట్ టైమ్స్' పేరుతో ఆత్మకథను కూడా రచించారు.

## గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రానిదే బాధ్యత... సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు: పొన్నం ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి)

విజన్ ఉందని, ఈ ప్రాజెక్టుపై ఉన్న అన్ని అనుమానాలను పీపీటీ ద్వారా నివృత్తి చేస్తామని తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని నిర్వాసితులకు ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం చేస్తుందని, వారిని ఇబ్బంది పెట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ మనవడు తుషార్ గాంధీకి మూసీ ప్రాజెక్టుపై ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చారని, అందుకే ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు.బీజేపీకి రాష్ట్రంలో ఒక అజెండా, దేశంలో మరో అజెండా ఉందని పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం అనేది కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని, దీనిపై అనవసర రాద్ధాంతం చేయవద్దని సూచించారు.



# ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ...

(మొదటి పేజీ తరువాయి)

**గిరిజన రైతులకు 100 శాతం సబ్సిడీ**

దాత్రి ఆభా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లో భాగంగా 8 గిరిజన జిల్లాల్లోని అటవీ హక్కు పత్రాలు (ఎఫ్ఆర్ఏ) ఉన్న రైతులకు ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' పథకం కింద డ్రిప్ ఇరిగేషన్‌పై 100 శాతం, స్ప్రింక్లర్లపై 90 శాతం సబ్సిడీని శాచురేషన్ పద్ధతిలో అందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కొండ ప్రాంతాల్లో సాగు చేసే గిరిజనులకు నీటి వనరుల సమస్యను అధిగమించి, అధిక దిగుబడులు సాధించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను 54 శాతానికి పెంచుకోవడం వల్లే ఇది సాధ్యమైందని మంత్రి వివరించారు.

నీటి కాలుష్య నివారణ చట్టానికి ఆమోదం

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'నీటి కాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టం-2024'ను రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కొత్త చట్టం ప్రకారం, చిన్న చిన్న ఉల్లంఘనలకు విధించే జైలు శిక్షలను తొలగించి, వాటి స్థానంలో జరిమానాలు మాత్రమే విధిస్తారు. ఈ చట్టాన్ని ఆమోదించడం ద్వారా రాష్ట్రంలోని కాలుష్య నగరాలకు 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం' కింద కేంద్రం నుంచి నిధులు పొందేందుకు, పరిశ్రమలపై ఫీజుల భారం తగ్గించుకునేందుకు వీలు కలుగుతుంది.

ఉద్యోగినుల కోసం 'సఖీ నివాస్' హాస్టళ్లు

మిషన్ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఉద్యోగాలు చేసే మహిళల కోసం 'సఖీ నివాస్' పేరుతో 30 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. సురక్షితమైన వసతితో పాటు, చిన్న పిల్లలున్న తల్లుల సౌకర్యార్థం ఈ హాస్టళ్లలో క్రెష్ (శిశు సంరక్షణ కేంద్రం) సదుపాయాన్ని కూడా కల్పిస్తారు. ఉద్యోగినులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో హాస్టల్ నిర్వహణకు 8 మంది సిబ్బందిని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తారు.

వ్యాపారులకు జీఎస్టీ ట్రైబ్యునల్స్

జీఎస్టీ సంబంధిత వివాదాల పరిష్కారాన్ని సులభతరం చేసేందుకు, వ్యాపారులకు సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అన్ని అప్పీళ్లను విజయవాడలోనే విచారిస్తుండటంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీన్ని నివారించేందుకు విశాఖపట్నం, తిరుపతి, విజయవాడలలో మూడు అప్పిలేట్ ట్రైబ్యునల్ కార్యాలయాలను నోటిఫై చేసేందుకు కేబినెట్ ఆమోదించింది. దీనివల్ల కేసులు త్వరగా పరిష్కారమై రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం కూడా సకాలంలో అందుతుంది.

జల జీవన్ మిషన్‌కు భారీగా నిధులు

ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన జల జీవన్ మిషన్ (జేజేఎమ్) పథకం గడువు ముగిసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో కేంద్రం దానిని 2028 వరకు పొడిగించింది. ఈ నేపథ్యంలో, వివిధ పథకాల కింద నిధులు సమకూర్చుకుని రూ.9,355 కోట్ల విలువైన ఏడు భారీ ప్రాజెక్టులకు మంత్రివర్గం పరిపాలన ఆమోదం తెలిపింది. అలాగే, తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న 3000 నివాస ప్రాంతాలకు రూ.1,814.71 కోట్లతో తాగునీటి పనులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 76 మండలాల్లోని 65 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

కొత్తగా కేంద్రీయ విద్యాలయాలు

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఊతమిస్తూ మూడు కొత్త కేంద్రీయ విద్యాలయాల (కేవీ) ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రాఘవాపురంలో 5 ఎకరాలు, ఏలూరు జిల్లా నూజివీడులో 7 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పురుషోత్తపురంలో 5 ఎకరాల చొప్పున భూమిని కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు కేటాయించారు. బదిలీలపై వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలతో పాటు స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం దీని ముఖ్య ఉద్దేశం.

పోలవరం పనుల వేగవంతానికి ఆమోదం

రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పనులను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కాంట్రాక్ట్ గడువు జూన్ 2027 వరకు ఉన్నప్పటికీ, పనులను త్వరగా పూర్తి చేసే లక్ష్యంతో మూడో గ్యాంట్రీ క్రేన్‌ను ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. ప్రాజెక్టులో లైనింగ్ పనులతో పాటు, సుదీర్ఘకాలం పనులు నిలిచిపోవడం వల్ల దెబ్బతిన్న రాతి పొరల వద్ద భద్రతా చర్యలు చేపట్టనున్నారు. ఈ అదనపు పనుల కోసం ప్యాకేజీ-63ఏ కు రూ.23.47 కోట్లు, ప్యాకేజీ-64ఏ కు రూ.24.51 కోట్ల అదనపు వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పార్థసారథి వివరించారు.

## పార్టీ ఫిరాయింపులు... రాహుల్ గాంధీకి హరీశ్ రావు లేఖ

కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ రాజ్యాంగం చేతబట్టి దేశమంతా నీతిసూత్రాలు చెబుతున్నారని, కానీ ఆ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం ప్రభుత్వం మరోలా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో రాహుల్ గాంధీపై, కాంగ్రెస్ పార్టీ తీరుపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఈ మేరకు రాహుల్ గాంధీకి లేఖ రాశారు.ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ చెప్పిందని గుర్తు చేశారు. అలాగే రాహుల్ గాంధీ కూడా దేశమంతా నీతిసూత్రాలు చెబుతున్నారని అన్నారు. కానీ తెలంగాణలో రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని అన్నారు. ఫిరాయింపులను ప్రోత్సహించడమే రాజ్యాంగాన్ని రక్షించడమా అని ఎద్దేవా చేశారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అవకాశవాదం కోసం ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు.



## సమ్మె నోటీసు ఇచ్చిన తెలంగాణ ఆర్టీసీ జేఏసీ

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంలో చేయడంతో పాటు వివిధ డిమాండ్లపై కార్మికులు ఈ నోటీసు ఇచ్చారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు వెళతామని హెచ్చరించారు. సమ్మె తేదీపై 14 రోజుల తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆర్టీసీ జేఏసీ తెలిపింది. ఆర్టీసీ ఎండీ అందుబాటులో లేకపోవడంతో పేషీలో నోటీసులు ఇచ్చింది. లేబర్ కమిషనర్ కార్యాలయంలోనూ నోటీసులు ఇచ్చింది. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని ఆర్టీసీ జేఏసీ కోరింది. మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెల రూ.350 కోట్లు కోత లేకుండా ఇవ్వాలని, పాత బకాయిలు రూ.2,500 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ఉద్యోగులపై అధిక పనిభారం తగ్గించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.




## కీసరగుట్ట వేద విజ్ఞాన పీఠాన్ని సందర్శించిన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు నేడు కీసరగుట్టలోని శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞాన పీఠాన్ని సందర్శించి, అక్కడ కొనసాగుతున్న విద్యాబోధనను పరిశీలించారు. ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత క్షేత్రస్థాయిలో వేద విద్యా సంస్థలను సందర్శిస్తున్న ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, వేద పాఠశాల చరిత్ర, ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు.పాఠశాల ప్రిన్సిపాల్ గూడ శ్రీనివాస శర్మతో మాట్లాడిన ఛైర్మన్, ప్రస్తుతం ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల వివరాలను, వారికి అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. పురాతన వేద సంపదను కాపాడుకోవడంలో వేద పాఠశాలల పాత్ర కీలకమని పేర్కొంటూ, భవిష్యత్తులో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వేద విజ్ఞానాన్ని భావితరాలకు అందించడంలో టీటీడీ ఎప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.పాఠశాలలోని సౌకర్యాల పట్ల విద్యార్థులు మరియు అధ్యాపకులు తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో పాఠశాల సిబ్బందితో పాటు ఇంజనీరింగ్ అధికారులు డీఈ రామకృష్ణ, జేఈ చలమా నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సాక్షిత
తెలుగు దినపత్రిక
మార్చ్ | శనివారం | 14 | 2026



# పిఎంపి, డయాడాడ్ ఫౌండేషన్ సేవలు ఎంతో అభినందనీయం

**"పరీక్షల సమయంలో భయానికి గురి కావొద్దు."**
**'పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ.'**

**సాక్షిత :**

దూడల వెంకయ్య, మాజీ విఆర్ఓ. బుజబుజ నెల్లూరు లోని డి.వి.ఎన్.యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శుక్రవారం, డయాడాట్ ఫౌండేషన్ మరియు కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు, షాప్నర్లు, హాల్ టికెట్ భద్రపరిచే బ్రోచర్స్, లాంగ్ స్కేల్ మరియు పండ్లు, బిస్కెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ విఆర్ఓ, పాఠశాల వ్యవస్థాపకులు దూడల వెంకయ్య మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షా కాలంలో ఎలాంటి భయానికి లోను కావద్దని అన్నారు. ఈ సందర్భంగా పరీక్షలకు అవసరమైనటువంటి విద్యా సామాగ్రిని అందజేసిన డయాడాట్ ఫౌండేషన్, పీఎంపీల సేవలు ఎంతో అభినందనమని కొనియాడారు. పదవ తరగతి విద్యార్థులకు అత్యంత కీలకమైన సమయమని, ప్రణాళిక ప్రకారం చదువుకోవాలని, ఒత్తిడికి గురికాకుండా ముందడుగు వేయాలని, సమయపాలన చాలా ముఖ్యమని, పరీక్షా సమయంలో కాలక్షేపానికి తావు ఇవ్వకూడదని, ప్రధానంగా స్మార్ట్ ఫోన్లు, ఎలక్ట్రిక్ పరికరాలతో గడపడం, కబుర్లు, షికార్లు, బైక్ రైడింగ్ లు, ముఖ్యంగా



సినిమాలకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు కూడా ఇంట్లో చదువుకునే వాతావరణం కల్పించాలని, రాత్రి సమయంలో బలవంతంగా చదవడం వల్ల మెదడుకు చేరకపోగా అనారోగ్యానికి దారితీస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటరమణ, పాఠశాల వ్యవస్థాపకులు దూడల ప్రసాద్ రావు, నగళ్ళ రాము, పి.హెచ్. జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, దేవరకొండ శ్రీనివాసులు, డయాడాట్ పౌండేషన్ నాయకులు విలియం ఆంటోనీరాజా, చెన్నకేశవ, మీరా మొహిద్దిన్, ఆశిక్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

**కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయం**

సాక్షిత : కుత్బుల్లాపూర్ జోనల్ నూతన కమిషనర్ పింకేష్ కుమార్ లలిత్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేసిన సీనియర్ బిఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ మరియు మాజీ ప్రెసిడెంట్ ఆలూరు వెంకట శేషాచారిలి.....నూతనంగా నియమితులైన కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ని జోనల్ కమిషనర్ ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిసి ఎస్సార్ నాయక్ నగర్ లో జిహెచ్ఎంసి పార్కు డెవలప్మెంట్ మరియు ఉమ్మడి (130) సుభాష్ నగర్ డివిజన్లో ఉన్న పలు సమస్యలు పరిష్కరించాలని గుబ్బల లక్ష్మీనారాయణ మరియు ఆలూరి వెంకట శేషాచారి జోనల్ కమిషనర్ ని కలిసి వినతి పత్రము అందజేయడం జరిగింది...ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ గారు మాట్లాడుతూ త్వరలో పర్యటన చేసి కిందిస్థాయి సిబ్బందితో కూడా మాట్లాడి పార్క్ డెవలప్మెంట్ మరియు డివిజన్లో ఉన్న పలు సమస్యలపై పర్యటించి పరిష్కారం అయ్యేటట్టు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్ నాయక్ నగర్ మాజీ ప్రెసిడెంట్ ఆలూరు వెంకట శేషాచారి, ఎతీం యువ నాయకులు సాయిరాం రెడ్డి, సోమేశ్వరరావు గోవిందస్వామి, కుడుపూడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు



# ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే నిజమైన జర్నలిజం

**నిజం కోసం కలం పట్టిన నజీర్ ఖాన్‌కు ప్రతిష్టాత్మక గౌరవం**

సాక్షిత: సాధారణ కుటుంబంలో జన్మించి తన కలం శక్తితో సమాజంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న జర్నలిస్ట్ నజీర్ ఖాన్‌కు అరుదైన గౌరవం దక్కింది. పత్రికారంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలను గుర్తిస్తూ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్పూర్తి అకాడమీ ఫౌండర్ ఛ చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్ చేతుల మీదుగా అందజేశారు.సూర్యాపేట ప్రాంతంలో జర్నలిజం రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించిన నజీర్ ఖాన్, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, బాధితులకు న్యాయం జరిగేలా వార్తల ద్వారా అవగాహన కల్పించడం ఆయన జర్నలిజం లక్షణంగా నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు, రహదారి సమస్యలు, మౌలిక వసతుల కొరత, సామాజిక సమస్యలు వంటి అనేక అంశాలపై ఆయన రాసిన కథనాలు ప్రజల్లో చైతన్యం కలిగించాయి. సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి దోహదపడిన సందర్భాలు అనేకం. నిష్పక్షపాత ధోరణి, నిజాయితీతో ఆయన జర్నలిజం కొనసాగిస్తూ ప్రజల నమ్మకాన్ని సంపాదించారు.జర్నలిస్ట్‌గా మాత్రమే కాకుండా సామాజిక బాధ్యతతో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల్లో కూడా ఆయన చురుకుగా పాల్గొంటున్నారు. యువతలో చైతన్యం కలిగించే కార్యక్రమాలు, సామాజిక అవగాహన కార్యక్రమాల్లో కూడా పాల్గొంటూ సమాజానికి సేవ చేస్తున్నారు.ఈ నేపథ్యంలో పత్రికారంగంలో ఆయన చేసిన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్‌తో సత్కరించడం విశేషంగా భావిస్తున్నారు. ఈ అవార్డు కార్యక్రమం మార్చి 10, 2026న హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ఉన్న సిటీ కల్చరల్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి సెక్రటరీ డాక్టర్ కాశీనాథ్, నేషనల్ హ్యూమన్ రైట్స్ వింగ్ చైర్మన్ డాక్టర్ సరిత మాలో, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీవో చీఫ్ అడ్వైజర్, జిహెచ్ఎంసి బీజేపీ నాయకుడు గూడూరి శ్రీనివాసరెడ్డి, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం ఎంఈఓ డాక్టర్ కస్నా నాయక్, "వందే భారత్ సేవ్ ఇండియా" మూవీ డైరెక్టర్, ప్రొడ్యూసర్ మరియు సినీ నటుడు మల్లం రమేష్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా స్ఫూర్తి సర్వీసెస్ ఫౌండర్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్, స్ఫూర్తి సర్వీసెస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆకుల మంజుల చేతుల మీదుగా జర్నలిస్ట్ నజీర్ ఖాన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నజీర్ ఖాన్ మాట్లాడుతూ, "ఈ గౌరవం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఇది నా వ్యక్తిగత విజయమే కాదు, నన్ను నమ్మి ప్రోత్సహించిన ప్రతి పాఠకుడి విజయం. ఈ అవార్డు నాకు మరింత బాధ్యతను పెంచింది. ఇకపై కూడా ప్రజల పక్షాన నిలబడి నిజం కోసం నిర్భయంగా కలం పట్టుతాను" అని అన్నారు.పత్రికారంగంలో ఆయన చేసిన సేవలు యువ జర్నలిస్టులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పలువురు మేధావులు అభిప్రాయపడ్డారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిజం సమాజానికి ఎంతో అవసరమని, అలాంటి జర్నలిస్టులకు ఈ తరహా గౌరవాలు దక్కడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.




## రామగుండం మునిసిపల్ కార్పొరేషన్ అభివృద్ధి లో ముందడుగు....

**అభివృద్ధి లో యువ మేయర్ భేష్...**

**సాక్షిత పెద్దపల్లి :**



రామగుండం వరద నీటి కాలువల్లో పూడిక తీత పనులను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తీరుస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు . రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" లో భాగంగా చేపట్టిన సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులను పరిశీలించడానికి శుక్రవారం తెల్లవారుఝామున్నే 3, 48, 49 డివిజన్ లలో పర్యటించి మురుగు నీటి కాలువలను పరిశీలించారు. సాయిలీల హోటల్ ప్రక్క నుండి ప్రవహిస్తున్న మురుగు నీటి కాలువలో చేపట్టిన పూడిక తీత పనులను పర్యవేక్షించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... కాలువ నిర్మించకపోవడం , పది సంవత్సరాలుగా సరిగా పూడిక తీయకపోవడంతో మురుగు నీరు నిలిచిపోయి పరిసరప్రాంత వాసులు భరించలేని దుర్గంధంతోపాటు అనేక రోగాల బారిన పడుతున్నారని అన్నారు. మల్కాపూర్ శివారు లో నిర్మిస్తున్న సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్ నుండి టీచర్స్ కాలనీ వరకు వరద నీటి కాలువ కాంక్రీట్ నిర్మాణం చేపట్టి ఒక్క నీటి చుక్క కూడా నిలిచిపోకుండా సాఫీ గా ప్రవహించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.నగరంలోని అన్ని ప్రదాన కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని అన్నారు. ఈ సంధర్భంగా ఆయన స్వయంగా జెసిబి యంత్రాన్ని ఆపరేట్ చేసి ముళ్ళ పొదలు, పిచ్చి చెట్లు తొలగించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్ లతో పాటు డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. వి. రామన్, టి పి ఎస్ నవీన్ , వార్డు అధికారులు , సానిటరీ ఇన్స్పెక్టర్లు , జవాన్లు , మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కో-కన్వీనర్‌గా రావుల శేషగిరి

**సాక్షిత :**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రావుల శేషగిరి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి కి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కో కన్వీనర్ గా నియమితులు అయినా సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి అధ్యక్షులు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి ని మరియు ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా వారి నివాసంలో కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె శేఖర్ యాదవ్ , యువ నాయకులు రావుల పృథ్వీ , ఉమ్మడి గాజులరామారం డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత జిల్లా కౌన్సిల్ సభ్యులు కండి శ్రీరాములు జిల్లా అధికార ప్రతినిధి రచ్చ చక్రధర్ 128 చింతల్ డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ సదానంద్ సుభాష్ నగర్ డివిజన్ నాయకులు యాదగిరి , మంజునాథ్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## జన సైనికులశీదరికీ ఇదే ప్రత్యేక ఆహ్వానం

**సాక్షిత :**



జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ది 14.03.2026( శనివారం) ఉదయం 09:00 గంటలకి విజయవాడ ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది.అనంతరం ఆహార వితరణ, పర్యావరణ పరిరక్షణలో మొక్కలు నాటడం, మొక్కలు పంపిణీ కార్యక్రమం కలదు.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను పాల్గొంటారు.కావున జనసేన పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నగర కమిటీ సభ్యులు,పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి. ఇట్లు ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ కార్యాలయం.

## రెండున్నర రోజుల్లో సిలిండర్ డెలివరీ రాకపోతే ఫిర్యాదు చేయవచ్చు



సాక్షిత : కోవూరు నియోజకవర్గ శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి తెలియజేయడం ఏమనగా.సిలిండర్ కొరత ఉన్నందున కోవూరు మండల ప్రజలందరికీ ముఖ్య సమాచారం.గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్నా డెలివరీ కాకపోతే వినియోగదారులు ఫిర్యాదు చేయాలని కోవూరు ఎమ్మెల్యే సూచించారు. కేంద్రం కొత్త నిబంధనల ప్రకారం బుకింగ్ చేసిన తర్వాత సుమారు రెండున్నర రోజుల్లో సిలిండర్ డెలివరీ చేయాల్సి ఉంటుంది.డెలివరీ ఆలస్యం అయితే ఇండేన్ గ్యాస్ వినియోగదారులు 1800-2333-555 లేదా 7718955555కు, భారత్ గ్యాస్ కస్టమర్లు 1800-22-4344 లేదా 7715012345కు, HP గ్యాస్ వినియోగదారులు 1800-2333-555 లేదా 9493602222కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.లేదా స్థానిక లీడర్లకు అధికారులకు తెలియజేసినట్లయితే మీ సమస్యకు పరిష్కారాన్ని చూపెదరు..

సాక్షిత
తెలుగు దినపత్రిక





సాక్షిత : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు కుమార్ యాదవ్ మనవరాలు తోట్టేలా కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన లినియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి లి . ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కోలన్ రాజశేఖర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళ నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వచేసిన 41 గ్యాస్ సిలిండర్లు సీజ్

**గ్యాస్ సిలిండర్ల కృత్రిమ కొరత సృష్టించిన, అక్రమ మార్గంలో అమ్మిన చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు**

**నకిలీ వ్యక్తులకు గ్యాస్ సిలిండర్ లు ఇవ్వకూడదు.**

**సరిపడా గ్యాస్ నిలువలు అందుబాటులో ఉన్నాయి, ప్రజలు ఆందోళన చెందవద్దు : ఎస్పీ**


**సాక్షిత సూర్యాపేట జిల్లా ప్రతినిధి:**



సూర్యాపేట పట్టణ పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ పోలీస్ సిబ్బంది సూర్యాపేట పట్టణంలో పిఎస్ఆర్ సెంటర్ లో ఒక తనిఖీలు నిర్వహించగా అందులో అక్రమంగా నిల్వచేసిన 41 సిలిండర్ లు గుర్తించడం జరిగిందని వీటిని సీజ్ చేశామని జిల్లా ఎస్పీ నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 21 గృహ ఉపయోగకరమైనయని, 20 వాణిజ్యపరమైనని ఉన్నాయని అన్నారు. దీనికి సంబంధించి అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజల అవసరాలకు ఉపయోగపడే గ్యాస్ సిలిండర్లను అక్రమ మార్గంలో అమ్మిన, అక్రమంగా నిలువచేసిన, కృత్రిమ కొరత సృష్టించిన అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ ఉపయోగకరమైన గ్యాస్ సిలిండర్లను వాణిజ్యపరంగా అమ్మకూడదని సూచించారు. ప్రజల ఉపయోగాలు, హాస్పటల్ వినియోగానికి నిలువలు అందుబాటులో ఉన్నాయి. గ్యాస్ సిలిండర్ లను అక్రమ మార్గంలోకి తరలించినా, గ్యాస్ నిల్వలపై, గ్యాస్ ధరలపై ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల అవసరాలకు సరిపడా గ్యాస్ సిలిండర్ నిలువలు అందుబాటులో ఉన్నాయని ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. నిబంధనల ప్రకారం సంబంధిత ఏజెన్సీలు గ్రామాలలో, పట్టణాలలో వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లను సకాలంలో అందిస్తాయని అన్నారు. ప్రజలు ఆందోళన చెంది గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరవద్దని, గ్యాస్ టోల్ ఫ్రీ నెంబర్లను సంప్రదించవద్దని కోరారు. గ్యాస్ ఏజెన్సీలు అప్రమత్తంగా ఉండాలని ఎవరైనా నకిలీ వ్యక్తులు గ్యాస్ ను బుక్ చేసినట్లయితే అలాంటి వారిని గుర్తించాలని కోరారు. గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తున్న ఏజెన్సీలు బాధ్యతగా ఉండాలని కోరారు. గ్యాస్ అమ్మకాల కు సంబంధించి పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉందని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## రంజాన్ సందర్భంగా 'ఈద్ కా తోఫా' పంపిణీ

సాక్షిత : రంజాన్ పండుగ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ముస్లిం సోదరులకు తోడ్పాటు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న "ఈద్ కా తోఫా" (రంజాన్ కానుక) పథకం పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మరియు బహదూర్ పల్లి మసీదులల్లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లికుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై మసీదుల ద్వారా అర్హులైన ముస్లిం కుటుంబాలకు ఈద్ కా తోఫాలు (దుస్తులు మరియు ఇతర నిత్యావసర వస్తువులు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, రంజాన్ పండుగ సోదరభావం, సహనం మరియు సేవా భావానికి ప్రతీక ,పేద మరియు అవసరమైన కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈద్ కా తోఫా పథకం వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో కొంపల్లి అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, లేబర్ సెల్ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసి గారి శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి, ఆదిరెడ్డి మోహన్ రెడ్డి, మాజీ కోప్షన్ సభ్యులు షైక్ ఇబ్రహీం, పూర్ణచందర్ రావు, జయభేరి గోపాల్ రెడ్డి, అశోక్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, అంజి ముదిరాజ్, కుంట శ్రీనివాస్, మజీద్ కమిటీ అధ్యక్షులు మహ్మద్, సభ్యులు షైక్ ఖాదీర్, సలీం, మైబలి, జహంగీర్, దస్తగిరి మరియు తదితరులు పాల్గొన్నారు.



# మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి -- రోడ్డు భద్రత, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి....

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా...**

**సాక్షిత పెద్దపల్లి//గోదావరిఖని**



ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా పిల్లల భద్రత,"మత్తు పదార్థాల వినియోగం--అనర్థాలు",సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా పిల్లల భద్రత,"మత్తు పదార్థాల వినియోగం--అనర్థాలు",సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పోలీస్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డీసీపీ మాట్లాడుతూ,మత్తు పదార్థాలకు బానిసలైతే ఎవరి భవిష్యత్తైనా నాశనం అవుతుందని తెలిపారు.ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలని సూచించారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని,ప్రతి ఒక్కరూ మంచిగా చదువుకుని తమ ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, విద్యార్థులు తమలో ఉన్న అపారమైన శక్తిని సరైన దిశలో వినియోగించుకోవాలని తెలిపారు. యువతలో సహజంగా ఉన్న ఉత్సాహం,శక్తిని క్రీడలు,చదువు సమాజ అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని సూచించారు.ఈ వయసులో శారీరకంగా, మానసికంగా ఎక్కువ శక్తి ఉంటుందని,ఆ శక్తిని మత్తు పదార్థాల వైపు మళ్లిస్తే ముందుగా ఆరోగ్యం దెబ్బతింటుందని, తరువాత జీవితమే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు.మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా దూరం పెట్టాలని, ఎవరికైనా అలాంటి అలవాటు ఉన్నట్లు తెలిసితే ముందుగా వారిని మార్చే ప్రయత్నం చేయాలని, మార్పు రాకపోతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.మత్తు పదార్థాల అక్రమ రవాణా,వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.అలాగే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా యువతలోనే జరుగుతున్నాయని పేర్కొన్నారు.నివేదికల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో 60 నుంచి 70 శాతం వరకు యువకులే బాధితులవుతున్నారని తెలిపారు.వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారును నడిపే సమయంలో సీటుబెల్ట్ ధరించాలని సూచించారు. ఎప్పుడూ రహదారి ఎడమ వైపునే ప్రయాణించాలని, భారీ వాహనాలను దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణమని హెచ్చరించారు.సైబర్ నేరాల విషయంలో కూడా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు అడగడం, అనుమానాస్పద లింకులు పంపడం వంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.గతంలో తల్లిదండ్రులు అపరిచితులు ఇచ్చే చాక్లెట్‌లను తీసుకోవద్దని చెప్పేవారని,ఇప్పుడు అదే మోసం మొబైల్ ఫోన్ ద్వారా వచ్చే లింకులు,మెసేజ్‌ల రూపంలో జరుగుతోందని వివరించారు.మొబైల్ ఫోన్ ద్వారా ప్రపంచంతో అనుసంధానం సాధ్యమవుతున్నప్పటికీ, అదే సమయంలో సైబర్ నేరస్థులకు కూడా అవకాశం కలుగుతుందని అందువల్ల ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్‌ను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని, అప్రమత్తంగా ఉంటేనే నేరాల నుంచి రక్షణ పొందగలమని సూచించారు.మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి పోలీస్ కళాబృందం పాటల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ డ్రగ్స్ వినియోగం--అనర్థాలపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ప్రవచనకర్త ఎస్.పి. నాయక్ బంజారా, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు, గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐలు రమేష్, అనూష,పోలీస్ సిబ్బంది, సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎల్పిజి గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదు.

**వినియోగదారులకు ఆందోళన వద్దు: కలెక్టర్**

**సాక్షిత సూర్యాపేట జిల్లా ప్రతినిధి:**



సూర్యాపేట జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ లకు ఎలాంటి కొరతలేదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. అయన అదనపు కలెక్టర్ చాంబర్లో జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు, పౌరసరఫరాల అధికారులతో ఎల్పిజి గ్యాస్ సరఫరాపై సమావేశం నిర్వహించారు. గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సరఫరా లో ఏలాంటి కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లాల్ 4, 15, 509 డొమెస్టిక్ కనెక్షన్లు ఉన్నాయని ప్రస్తుతం జిల్లాలో 17, 647 డొమెస్టిక్ సిలిండర్లు, 552 కమర్షియల్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, గ్యాస్ బుక్ చేసుకున్న రెండు మూడు రోజుల్లోనే వినియోగదారులకు సకాలంలో డెలివరీ చేయడం జరుగుతుందని వివరించారు. కమర్షియల్ సరఫరాలో ఏర్పడిన కొరతను అధిగమించేందుకు ఉపశమనం వైపు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని తెలిపారు. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ ను ఎవరైనా కమర్షియల్ గా వాడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. గృహ అవసరాలకు వినియోగించే ఎల్పిజి గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరతలేనందున ప్రజలు ఆందోళనకు గురై అనవసరంగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని కోరారు. సీనియారిటీ ప్రకారం ఏజెన్సీలు గ్యాస్ ను సరఫరా చేయడం జరుగుతున్నదని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సరిపోయినంతగా ఉందని కలెక్టర్ మరోసారి చెప్పారు. గ్యాస్ బుకింగ్ కు సంబంధించి సర్వర్ సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై కూడా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ విషయమై సంబంధిత గ్యాస్ ఏజెన్సీ లతో మాట్లాడడం జరిగిందని, త్వరలోనే సర్వర్ సమస్యను పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎవరైనా ఏజెన్సీ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జిల్లా పౌర సరఫరా అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ సివిల్ సప్లై రాము, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారు భాషబోయిన ప్రియాంక నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు ...

**సాక్షిత హన్మకొండ జిల్లా / 65వ డివిజన్ / ఎల్లపూర్ :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ పరిధిలోని ఎల్లపూర్ గ్రామానికి చెందిన భాషబోయిన ప్రియాంక ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం నుంచి కేటాయించిన రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో తమ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు. నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని గృహప్రవేశం చేసి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నదన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తామని తెలిపారు. పేద ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు...ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల కల నెరవేరుతుందని, ఇలాంటి సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు....ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పార్టీ అధ్యక్షుడు నేదునూరి సునీల్, డివిజన్ అధ్యక్షుడు అయ్యాల రామిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎరుగొండ శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ఎర్ర ప్రకాష్, శ్రీను తో పాటు డివిజన్, గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...



# విద్యార్థులు కొత్త నైపుణ్యాలతో భవిష్యత్తును నిర్మించుకోవాలి: మంత్రి వివేక్ వెంకటస్వామి

- **కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సాప్ కోడ్ ఇనోవేషన్ 2025--26 ప్రారంభం**

**సాక్షిత ఘట్‌కేసర్:**

మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లోని కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సాప్ కోడ్ ఇనోవేషన్ 2025--26 కార్యక్రమాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సాప్ కోడ్ ఇనోవేషన్ రూమ్‌ను మంత్రి వివేక్ వెంకటస్వామి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ మంచి ఆలోచనతో ఈ విద్యాసంస్థను ప్రారంభించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మంచి స్థాయికి చేరాలంటే శ్రద్ధగా వినడం, క్రమశిక్షణతో చదవడం ఎంతో అవసరమన్నారు. తన విద్యార్థి దశలో జరిగిన ఒక అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ, ఏ పని చేసినా శ్రద్ధతో నేర్చుకోవాలని చెప్పారు. ప్రస్తుతం కొత్త కొత్త సాంకేతికతలు వస్తున్నాయని, వాటిని చూసి భయపడకుండా నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. సాంకేతికతను అవగాహన చేసుకుంటే భయం ఉండదన్నారు. కార్యక్రమంలో మాట్లాడిన కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్వహిస్తున్న సాప్ కోడ్ ఇనోవేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి వెంకటస్వామి సేవలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. అనంతరం వివిధ



కళాశాలల నుంచి వచ్చి సాప్ కోడ్ ఇనోవేషన్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు మంత్రి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీ జంగయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు మహేష్ గౌడ్, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో బాల నిందితులకు తీర్పు

**18 నెలలు సంస్కరణ గృహానికి పంపాలని కోర్టు ఆదేశం**

**సాక్షిత సూర్యాపేట జిల్లా ప్రతినిధి:**

కేతేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్యాయత్నం కేసులో నలుగురు బాల నిందితులను దోషులుగా తేల్చుతూ నల్గొండ జువెనైల్ జస్టిస్ బోర్డు కోర్టు కీలక తీర్పు వెలువరించింది. నిందితులను 18 నెలలపాటు హైదరాబాద్‌లోని ప్రత్యేక బాల సంస్కరణ గృహంలో ఉంచాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించి Cr.No.29/2020, JCC.No.83/2022 కింద విచారణ జరిపిన నల్గొండ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మరియు జువెనైల్ జస్టిస్ బోర్డు న్యాయమూర్తి కె. శిరీష నిందితులు చేసిన నేరాలను పరిశీలించి వారికి శిక్ష విధించారు. కేతేపల్లి మండలానికి చెందిన నలుగురు బాల నిందితులు ఐపీసీ సెక్షన్లు 120(బీ), 143, 147, 148, 324, 307, 301 r/w 149 కింద నేరానికి పాల్పడినట్లు కోర్టు నిర్ధారించింది. ఈ నేపథ్యంలో నిందితులను హైదరాబాద్‌లోని స్పెషల్ హోమ్ ఫర్ బాయ్స్ (Special Home for Boys) కు తరలించి 18 నెలలపాటు అక్కడ ఉంచాలని ఆదేశించింది. సంస్కరణ గృహంలో ఉండే కాలంలో వారికి





విద్య, నైపుణ్యాభివృద్ధి, కౌన్సెలింగ్, ప్రవర్తనా మార్పు కార్యక్రమాలు ఖఽవజఅంష్ఘ్రుఅస్త్రుఝ సంస్కరణాత్మక సేవలు అందించాలని కోర్టు పేర్కొంది. అలాగే ఐపీసీ సెక్షన్లు 143 మరియు 324 కింద ఒక్కొక్కరికి రూ.2000 చొప్పున జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఒక నెలపాటు సంస్కరణ గృహంలో ఉండాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్. కృష్ణయ్య వాదనలు వినిపించారు. కేసును దర్యాప్తు చేసిన అప్పటి ఎస్.ఐ బి. రామకృష్ణ, సీఐ పి.ఎన్.డి. ప్రసాద్, సీఐ ఎస్. రాఘవరావు కీలక ఆధారాలు సమర్పించారు. ప్రస్తుతం ఎస్‌డీపీఓ కె. శివరాం రెడ్డి, శాలిగౌరారం సర్కిల్ సీఐ కె. కొండల్ రెడ్డి, కేతేపల్లి ఎస్‌హెచ్‌ఓ యు. సతీష్, కోర్ట్ కానిస్టేబుల్ కిరణ్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.


# శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని అన్ని లేఅవుట్ లలో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని చేవెళ్ల ఎమ్మెల్యేకు బిజెపి నాయకుల వినతి

**శంకర్‌పల్లి సాక్షిత :**

శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని 15 వార్డులలో గల అన్ని లేఅవుట్ లలో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని మున్సిపల్ కార్యాలయంలో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యకు మున్సిపల్ మండల, బిజెపి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ఈనెల 11న 14వ వార్డు కాలనీ యందు మండల బిజెపి మహిళ అధ్యక్షురాలు గండేటి గాయత్రి రమేష్ గౌడ్ ఇంటి ఆవరణలోని బాత్రూం ను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు అక్రమంగా కూల్చివేశారు.




అదేవిధంగా బాత్రూం పక్కన ఉన్న వేరే ఇంటి మెట్లను కూల్చలేదు. పట్టణ పరిధిలో ఉన్న అన్ని వెంచర్లే అవుట్ ప్రకారం రోడ్లకు ఇరువైపులా ఉన్న అక్రమంగా నిర్మించిన వాటిని వెంటనే తొలగించాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు లేనిపక్షంలో బిజెపి తరఫున పెద్ద ఎత్తున మున్సిపల్ పరిధిలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. అక్రమంగా నిర్మించిన వాటిని మున్సిపల్ అధికారులు గుర్తించి వెంటనే తొలగించి ప్రజలందరికీ న్యాయం చేయాలని బిజెపి నాయకులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ప్రవీణ్ కుమార్ వైస్ చైర్మన్ శ్వేతా పాండురంగారెడ్డి బిజెపి సీనియర్ నాయకులు కాలనీవాసులు ఉన్నారు.




## ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత



సాక్షిత : లిఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూశారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న హెచ్‌జే దొర ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

## చంద్రన్న ప్రభుత్వంలో రైతే రారాజు

**రైతుల పక్షపాతి చంద్రబాబు..**

**పండుగ వాతావరణంలో 3వ విడత అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ నిధులు విడుదల..**

**నియోజకవర్గంలో రూ. 9,30,24వేలు రైతుల ఖాతాలోకి జమ..**

**ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి**

**సాక్షిత : నెల్లూరు జిల్లా**



కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని, చంద్రబాబు రైతు పక్షపాతి అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శుక్రవారం ఇందుకూరుపేట మండలం దేవిస్పేట పంచాయతీలో అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ నిధులు విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా దేవి పేటలోని పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడి పొలంలో బీర కాకర విత్తనాలను నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మూడు విడతల్లో 20000 అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ ద్వారా అందించడం జరిగిందన్నారు. డెల్టా ప్రాంతమైన కోవూరు నియోజకవర్గంలో 16,938/ మంది రైతులకు 9 కోట్ల 30 లక్షల 24 వేల రూపాయలు మూడో విడతగా రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. ధాన్యం సేకరణకు రైతులు ఇబ్బంది పడకుండా 48 ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ధర స్థిరత్వం ఉండేందుకు అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వంలో రైతులు ఇబ్బంది పడ్డారని, కోటమి ప్రభుత్వంలో 24 గంటలలో హమాలీలతో సహా ధాన్యం కొనుగోలు డబ్బులు ఇవ్వడం జరిగిందన్నారు. కాలువలు సకాలంలో పూడిక తీసి చివరి ఆయకట్టు వరకు నీరు పారేలా చేశామన్నారు. నియోజకవర్గంలో రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడిఏ జి అనిత, టిడిపి మండల అధ్యక్షుడు ఏ పవన్ రెడ్డి, చెంచు కిషోర్, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, పెద్ద ఎత్తున రైతులు నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు..

## భౌరంపేట్ లహరి గ్రీన్ పార్క్ కాలనీ లో పర్యటించిన మీడూా కేపీ.వివేకానంద ...

సాక్షిత : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ లోని లహరి గ్రీన్ పార్క్ కాలనీ లో గల సమస్యల గురించి మీడూా కేపీ. వివేకానంద కి విన్నవించుకోగా వారు స్థానిక నాయకులతో కలిసి కాలనీలో పర్యటించారు. అనంతరం వారితో



మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. దాదాపు 1000 కుటుంబాల వరకు ఉండే ఈ కాలనీ లో రోడ్డు, స్ట్రీట్ లైట్స్ , వాటర్ మరియు డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు తెలుపగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. కాలనీ లో గల రోడ్డు సమస్యను త్వరలోనే పరిష్కారం అయ్యేలా తగు చర్యలు తీసుకుంటానని తెలియజేసారు. తప్పకుండా కాలనీ కి అన్ని వసతులు కల్పించేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ్రాూజూ చైర్మన్ బాల్ రెడ్డి , భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి , దీ=ూ నాయకులు బెంబెడి బుచ్చిరెడ్డి , ధర్మారెడ్డి , మురళీ యాదవ్ , విష్ణువర్ధన్ రెడ్డి , కామేశ్వరరావు మరియు కాలనీ సెక్రటరీ ఎ.శ్రీనివాస్ రావు , ఆర్గనైసింగ్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి , మురళి కృష్ణ , ప్రశాంత్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు సింగరేణి గ్రౌండ్ లో మైనార్టీ సోదరుల ఇఫ్తార్ విందులో పాల్గోన్న శాసన సభ్యులు కోరం కనకయ్య

**సాక్షిత :**



మైనార్టీ సోదరులతో కలిసి ఇఫ్తార్ ఆరగించిన ఎమ్మెల్యే ... పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా,అత్యంత భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షల పాటించే మైనార్టీ సోదరులకు ఇఫ్తార్ విందు ఇల్లందు సింగరేణి గ్రౌండ్ నందు ఏర్పాటు చేసి వారితో కలసి ఇఫ్తార్ ఆరగించిన శాసన సభ్యులు కోరం కనకయ్య .....వారి వెంట ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు ....ఇల్లందు మున్సిపాలిటి చైర్మెన్ దొడ్డా కిరణ్ మిత్ర డానియల్ ,వైస్ చైర్మెన్ పెండేల రాజు ... మాజీ మున్సిపల్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు,మండలం మాజీ వైస్ ఎంపిపి మండల రాం మహేష్,కౌన్సలర్స్ సైదిమియా,వీణ జాఫర్,గొపగాని రాజు,స్వరూప రవి శంకర్,అజ్మీర వంశీ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ జానిపాషా,నాయకులు జానిపాషా,అజాం,అక్తర్,సర్పంచ్ లు,మైనార్టీ సోదరులు తదితరులు పాల్గోన్నారు

సాక్షిత
తెలుగు దినపత్రిక

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజక వర్గ మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ ...

**సాక్షిత :**



కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాంధీనగర్ లోని (రాయల్ ప్యాలెస్ లో ) శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ వేడుకల్లో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై విందులో పాల్గొన్నారు.... ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారు భేధాలు మరచి, ప్రేమను పంచి సోదరభావాన్ని పెంపొందించి మత సామరస్యం, ఐక్యత, ఆనందాన్ని ఆధ్యాత్మికను అందించే పవిత్ర మాసంలో జరిగే ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరలతో కలిసి పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.. అదేవిధంగా జగద్గిరిగుట్ట లోని ( శ్రీనివాస్ నగర్ లో) సయ్యద్ రషీద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో సైతం మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు... అదేవిధంగా మైనార్టీ సోదరులందరికీ ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మైనారిటీ సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్ధన చేసి ఉపవాస దీక్ష విరమణ లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు , నక్క ప్రభాకర్ గౌడ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ముస్లిం మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

## అలుమ్ని ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు


**సాక్షిత:**



all ఫ్యామిలీ మనం అనౌన్స్మెంట్ చేసి నట్టుగా మన అలుమ్ని ఆధ్వర్యం లో మన మైనార్టీ సోదర, సోదరి మణులకు , బసంత్నగర్ లో చదువుకున్న 1984తో 1995 బ్యాచ్ చదువుకు మైనార్టీ సోదర లకు మజీద్ లో ఇఫ్తార్ విందు అరేంజ్మెంట్ చేసి మన మిత్రుల తో విందులో భాగస్వామ్యం కావడం జరిగింది. దీనికి త్వరగా మనస్పూర్తిగా అంగీకరించి, కాంట్రిబ్యూట్ చేసినా కాల్వల రామస్వామి, దేవి laxminarsaiah , దాసరి శంకర్, గణపతి శ్రీను,KFT శంకర్, రెండ్ల శ్రీను, శ్రీలత, పాత రమాదేవి, G. తిరుమల, నేరేళ్ల శ్రీనివాస్, సాలూరి భాస్కర్ ,కట్టేకోలా వేణు, కొంకటి ప్రభాకర్, రాజన్న (Sedam), +. రామన్న మరియు తాటిపాముల రమేష్ పాల్గొనడం జరిగింది

## క్యాన్సర్ రాకుండా ఉండాలంటే ఈ పండు మస్తు పని చేస్తుంది..!

డ్రాగన్ ఫ్రూట్ లో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. అలాగే ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు బాగా ఉంటాయి. ఇవి శరీరంలో రోగాలు రాకుండా కాపాడుతాయి. వైరస్, బ్యాక్టీరియా వల్ల వచ్చే ఇన్ఫెక్షన్లు దరిచేరకుండా ఉంటాయి. ఈ పండు తినడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. డ్రాగన్ ఫ్రూట్ లో కొలెస్ట్రాల్ తక్కువగా ఉంటుంది. సాచురేటెడ్ కొవ్వులు కూడా చాలా తక్కువగా ఉంటాయి. ఒమేగా 3, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా ఉండటం వల్ల గుండె బలంగా ఉంటుంది. హృదయ సంబంధ సమస్యలు రాకుండా ఉంటాయి. డ్రాగన్ ఫ్రూట్లో బీటాసయానిన్స్, ఫ్లేవనాయిడ్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. వీటితో పాటు విటమిన్ సి కూడా శరీరానికి అందుతుంది. ఇవి శరీరంలో ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గిస్తాయి. దీంతో క్యాన్సర్ కణాలు పెరగకుండా ఉండే అవకాశం ఉంటుంది. ఈ పండులో కాల్షియం, మెగ్నీషియం లాంటి పోషకాలతో పాటు ఫాస్పరస్ కూడా ఉంటుంది. ఇవి ఎముకలకు అవసరమైన పోషకాలు. డ్రాగన్ ఫ్రూట్ తినడం వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి. ఎముకల బలహీనత రాకుండా ఉంటుంది.డ్రాగన్ ఫ్రూట్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. కేలరీలు మాత్రం చాలా తక్కువ. ఈ పండు తిన్నప్పుడు కడుపు నిండిన ఫీలింగ్ కలుగుతుంది. దీంతో ఎక్కువగా తినకుండా ఉండే అవకాశం ఉంటుంది. బరువు అదుపులో ఉంచుకోవడానికి ఇది సహాయపడుతుంది.డ్రాగన్ ఫ్రూట్లో డైటరీ ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది పేగులకు ఉపయోగపడుతుంది. జీర్ణక్రియ సజావుగా సాగుతుంది. గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలు తగ్గుతాయి. పేగుల ఆరోగ్యం మెరుగవుతుంది.డ్రాగన్ ఫ్రూట్ తినడం వల్ల రక్తంలో షుగర్ లెవెల్స్ ఒక్కసారిగా పెరగవు. అందువల్ల టైప్-2 డయాబెటిస్ వచ్చే అవకాశాలు తక్కువ అవుతాయి. డయాబెటిస్ను నియంత్రించుకోవాలనుకునేవారికి ఇది మంచిది. ఈ పండులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మానికి సహాయపడతాయి. ఇవి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. ముడతలు ఏర్పడకుండా ఉంటాయి. వయసు పెరిగినా చర్మం కాంతివంతంగా, యవ్వనం ఉట్టిపడేలా ఉంటుంది. డ్రాగన్ ఫ్రూట్లోని యాంటీ ఆక్సిడెంట్లు జుట్టును ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షిస్తాయి. దీంతో జుట్టు రాలడం తగ్గుతుంది. జుట్టు మందంగా, పొడవుగా పెరుగుతుంది. జుట్టు ఆరోగ్యంగా కనిపించేందుకు ఇది సహాయపడుతుంది.




# ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజలు దూరం... అవగాహన లోపమా? ప్రచార లోపమా?

### గ్రామసభలు, రైతువేదికల్లో సదస్సులకు ఆసక్తి చూపని ప్రజలు

**సాక్షిత సూర్యపేట జిల్లా ప్రతినిధి :**

ప్రభుత్వం ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నప్పటికీ వాటికి ప్రజల స్పందన మాత్రం ఆశించిన స్థాయిలో కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే గ్రామ సభలు, రైతుల అవగాహన సమావేశాలు, అభివృద్ధి కార్యక్రమాలు వంటి వాటికి ప్రజల హాజరు చాలా తక్కువగా ఉండటం గమనార్హంగా మారింది. సాధారణంగా ప్రజలకు ఉపయోగపడే పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గురించి వివరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తుంది. అయితే చాలా సందర్భాల్లో ప్రజలు తమ తమ పనుల్లో నిమగ్నమై ఉండడం, అలాగే ఈ కార్యక్రమాలపై సరైన అవగాహన లేకపోవడం వల్ల హాజరు కావడం లేదని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు సంబంధిత శాఖల అధికారులు కూడా కార్యక్రమాల గురించి సమర్థవంతంగా ప్రచారం చేయడంలో విఫలమవుతున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. కేవలం వాట్సాప్ గ్రూపుల్లో సందేశాలు పంపించడం ద్వారా బాధ్యత పూర్తయిందని భావిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామస్థాయిలో ముందుగా తెలియజేసే విధంగా దండోరా వేయించడం, మైక్ ప్రకటనలు చేయించడం, గ్రామ పెద్దలు మరియు సంఘాల ద్వారా సమాచారం అందించడం వంటి చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం కనిపిస్తోందని స్థానికులు అంటున్నారు. ప్రజలకు ప్రత్యక్షంగా సమాచారం చేరకపోవడం వల్ల ప్రభుత్వ కార్యక్రమాల




ప్రాధాన్యం తెలియకుండా పోతుందని, అందుకే చాలామంది వాటికి దూరంగా ఉంటున్నారని సామాజిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిస్థితి మారాలంటే అధికారులు గ్రామస్థాయిలో మరింత చురుకుగా ప్రచారం చేయడం, ప్రజల్లో అవగాహన పెంచే చర్యలు చేపట్టడం అవసరమని ప్రజలు సూచిస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడే పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలు నిజంగా ఫలితాలను ఇవ్వాలంటే ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అప్పుడు మాత్రమే ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజల భాగస్వామ్యం పెరిగి ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని వారు భావిస్తున్నారు.


# కొలెస్ట్రాల్ ఉన్న వారు నెయ్యి తినవచ్చా..?

నెయ్యి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నెయ్యిలో పోషకాలతో పాటు ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. నెయ్యి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. నెయ్యిలో అనేక విటమిన్లు, కాల్షియం, పొటాషియం ఉన్నాయి. ఇది కాకుండా, నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఉన్నాయి. నెయ్యి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నెయ్యిలో పోషకాలతో పాటు ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. నెయ్యి తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. నెయ్యిలో అనేక విటమిన్లు, కాల్షియం, పొటాషియం ఉన్నాయి. ఇది కాకుండా, నెయ్యిలో ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా ఉన్నాయి. శరీరానికి శక్తి రావాలంటే నెయ్యి తినాలని నిపుణులు చెబుతున్నారు. నెయ్యి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.. చర్మం, జుట్టు సమస్యలను కూడా నయం చేస్తుంది. నెయ్యి పోషకాలకు పవర్ హౌస్గా పేర్కొంటారు. శరీరానికి ఎంతో అవసరమైన విటమిన్-ఎ, విటమిన్-ఇ, విటమిన్-బి విటమిన్ కే తోపాటు విటమిన్ డి పుష్కలంగా ఉంటాయి.. అంతేకాకుండా.. ఒమేగా -3, ఒమేగా-6 వంటి ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు, లినోలిక్, బ్యుటిరిక్ యాసిడ్స్ వంటి పోషకాలు ఉన్నాయి. నెయ్యిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, ప్రస్తుత కాలంలో కొలెస్ట్రాల్తోపాటు ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి..



ఇలాంటి పరిస్థితుల్లో కొలెస్ట్రాల్ సమస్యలు ఉన్నవారు నెయ్యిని తినవచ్చా.. లేదా..? తింటే ఏమవుతుంది..? ఒకవేళ తింటే ఎంత తినాలి.. అనే ప్రశ్నలు సాధారణంగా ప్రతి ఒక్కరినీ వెంటాడుతున్నాయి. ఆయుర్వేదంలో ఔషధ వినియోగం: నెయ్యిలోని పోషకాలు, విశిష్ట లక్షణాల కారణంగా ఆయుర్వేదంలో ఔషధంగా ఉపయోగిస్తారు. నెయ్యి శరీరంలో మంచి కొలెస్ట్రాల్ను పెంచుతూ చెడు కొలెస్ట్రాల్ను తగ్గిస్తుందని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు..కొలెస్ట్రాల్ సమస్య ఉన్నవారు కూడా నెయ్యి తినవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.. అయితే.. రోజుకు కేవలం 2 నుంచి 3 స్పూన్లు నెయ్యి మాత్రమే తీసుకోవడం మంచిది.. అంతకు మించి నెయ్యి తీసుకోకూడదని పేర్కొంటున్నారు.కాబట్టి శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరగకుండా జాగ్రత్తపడాలి. చెడు కొలెస్ట్రాల్ పెరగడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని పేర్కొంటున్నారు.. కొలెస్ట్రాల్ ఉన్నవారు ముందుగా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకుని.. వారి సూచనల ప్రకారం.. నెయ్యిని తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే



శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు.
పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

# స్వదేశంలో అఫ్గనిస్థాన్‌తో.. ఆపై ఇంగ్లండ్ పర్యటన.. ఏడాదంతా క్రీడా వినోదమే..!



స్వదేశంలో పొట్టి ప్రపంచకప్‌ను ఒడిసిపట్టిన భారత జట్టు ఏడాదంతా బిజీబిజీగా గడపనుంది. ఐపీఎల్ (ఖూా 2026) ముగియడమే ఆలస్యం.. ఇంగ్లండ్ పర్యటనతో మొదలు.. తీరిక లేకుండా మ్యాచ్‌లు ఆడనుంది టీమిండియా. శ్రీలంకలో వరద బాధితుల సహాయార్థం నిధుల సమీకరణ కోసం పొట్టి సిరీస్‌లో భారత్ ఆడనుంది. ఐర్లాండ్, జింబాబ్వే.. యూఏఈ, బంగ్లాదేశ్ జట్లతో సిరీస్‌లు అంటూ మెన్ ఇన్ బ్లూ అభిమానులకు క్రికెట్ వినోదాన్ని పంచనుంది. ఈ క్రమంలోనే ఆసియా క్రీడలు వచ్చే వన్డే ప్రపంచకప్ సన్నద్ధతను కూడా బేరీజు వేసుకోనుంది. మరి.. వచ్చే 12 నెలల్లో ఏ జట్టుతో, ఏ ఫార్మాట్‌లో, ఎన్నేసి మ్యాచుల్లో భారత జట్టు తలపడనుందో చూద్దాం.మూడోసారి టీ20 వరల్డ్‌కప్ గెలుపొందిన భారత జట్టు.. ఐపీఎల్ అనంతరం విదేశీ, స్వదేశీ సిరీస్‌లతో అభిమానులను అలరించనుంది. 19వ సీజన్ ఐపీఎల్ ముగిశాక.. జూన్‌లో అఫ్గనిస్థాన్‌తో ఏకైక టెస్టు, మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా తలపడనుంది. ఆపై ఇంగ్లండ్ పర్యటనకు భారత బృందం వెళ్లనుంది. జూలై 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ వన్డే, టీ20 సిరీస్‌లో ఆతిథ్య జట్టుతో టీమిండియా మూడు వన్డేలు, ఐదు టీ20ల్లో అమీతుమీ తేల్చుకోనుంది. అనంతరం ఐర్లాండ్‌తో సిరీస్‌లో.. జూలై– ఆగస్టు మధ్య శ్రీలంకతో భారత జట్టు తలపడనుంది. ఆ దేశ బోర్డు అభ్యర్థన మేరకు వరద బాధితుల సహాయార్థం నిధుల సమీకరణ సిరీస్‌లో సూర్యకుమార్ సేన ఆడనుంది. నిరుడు నవంబర్‌లో దిత్వా తుఫాన్ లంకను అతలాకుతలం చేసి.. భారీగా ఆస్తి, ప్రాణ నష్టానికి కారణమైంది. ఆ విపత్తు సమయంలోనే నిత్యావసరాలు చేరవేసిన భారత ప్రభుత్వం.. ఇప్పుడు నిధుల సమీకరణకు క్రికెట్ మ్యాచ్‌లకు పచ్చజెండా ఊపింది.

బంగ్లాదేశ్‌తో వైట్ బాల్ సిరీస్

శ్రీలంకతో పొట్టి సిరీస్ ముగియగానే టీమిండియా -- అఫ్గనిస్థాన్ సిరీస్ ఉంటుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఇరుజట్ల మధ్య టీ20 సిరీస్ జరుగనుంది. అనంతరం బంగ్లాదేశ్‌తో ఆరు మ్యాచ్‌ల వైట్ బాల్ సిరీస్(మూడు వన్డేలు, మూడు టీ20లు)లో భారత్ తలపడనుంది. షెడ్యూల్ ప్రకారం నిరుడు ఆగస్టులో జరగాల్సిన ఈ సిరీస్ బంగ్లాలో అందోళనల నేపథ్యంలో వాయిదా పడింది. ప్రస్తుతం ఉస్మాన్ రెహమాన్ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం స్నేహ హస్తం చాటుతుండంతో బంగ్లాదేశ్‌కు జట్టును పంపేందుకు భారత ప్రభుత్వం అడ్డు చెప్పకపోవచ్చు. బంగ్లాతో సిరీస్ పూర్తవ్వంగానే .. కాస్త విరామం తీసుకొని జింబాబ్వే పర్యటనకు భారత జట్టు వెళ్లే అవకాశముంది. అయితే.. ఇప్పటికైతే షెడ్యూల్ ఇంకా ఖరారవ్వలేదు.ఈ ఏడాది ఆసియా క్రీడల కోసం భారత జట్టు సెప్టెంబర్‌లో జపాన్ వెళ్లనుంది. సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకూ జరిగే ఈ మెగా టోర్నీ జరుగనుంది. పొట్టి ఫార్మాట్లో నిర్వహించే ఈ మెగా టోర్నీలో నిరుడు స్వర్ణం గెలుపొందిన టీమిండియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది. ఆసియా క్రీడల తర్వాత న్యూజిలాండ్ గడ్డపై భారత బృందం అడుగు పెట్టనుంది. అక్టోబర్ 18 నుంచి ఆతిథ్య జట్టుతో ఐదు వన్డేలు, ఐదు టీ20ల్లో ఆడనుంది. వైట్ బాల్ సిరీస్ ముగిశాక ఇరుజట్లు రెండు టెస్టుల్లో తాడోపేడో తేల్చుకుంటాయి.

డిసెంబర్ తొలి వారంలో..

కివీస్‌తో టెస్టు సిరీస్ పూర్తయ్యాక.. డిసెంబర్ తొలివారంలో భారత జట్టు స్వదేశం రానుంది. సొంతగడ్డపై శ్రీలంకతో మూడేసి చొప్పున వన్డేలు, టీ20ల్లో తలపడుతుంది. లంకతో సిరీస్ ముగియడమే ఆలస్యం బోర్డర్ -- గవాస్కర్ ట్రోఫీ ఆస్ట్రేలియా జట్టు వాలిపోనుంది. వచ్చే ఏడాది జనవరి నుంచి ఫిబ్రవరి మధ్య.. టీమిండియా, ఆసీస్ మధ్య రసవత్తరంగా టెస్ట్ ఫైట్ జరుగనుంది. ఈ బిజీ క్రికెట్ షెడ్యూల్ పూర్తి కాగానే.. ఐపీఎల్ సందడి మొదలవ్వనుంది.

# గంభీర్, బుమ్రాపై ప్రత్యేక ప్రశంసలు కురిపించిన ధోనీ

ముంబై: 2026 టీ20 వరల్డ్‌కప్‌ను ఇండియా కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్లో సూర్యకుమార్ సేన 96 రన్స్ తేడాతో ఘన విజయాన్ని నమోదు చేసింది. టీ20 వరల్డ్‌కప్ టైటిల్‌ను మూడోసారి చేజిక్కించుకున్న టీమిండియా చరిత్రసృష్టించింది. అయితే 2007లో ఇండియాకు టీ20 వరల్డ్‌కప్ అందించిన మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ(మీా ఐష్ట్రశీఅఱ).. ఇవాళ తన ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించారు. ప్రధాన కోచ్ గంభీర్‌తో పాటు బౌలర్ బుమ్రాపై ధోనీ తన మెసేజ్‌లో ప్రశంసలు కురిపించాడు. గంభీర్ తన కోచింగ్ నైపుణ్యంతో జట్టును విజయతీరాలకు తీసుకెళ్లినట్లు ధోనీ తన సందేశంలో పేర్కొన్నాడు. గంభీర్ తన బృందంతో అసాధారణ ప్రతిభను కనబరిచినట్లు తెలిపాడు. ఫైనల్లో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్న జస్‌ప్రీత్ బుమ్రాను కూడా ధోనీ మెచ్చుకున్నాడు. బుమ్రా ఓ చాంపియన్ బౌలర్ అని తన మెసేజ్‌లో పేర్కొన్నాడు. బుమ్రా గురించి ఏమీ చెప్పకపోవడమే గొప్ప విషయమన్నాడు. భారత జట్టు అత్యద్భుతంగా రాణించిందని, అహ్మదాబాద్‌లో చరిత్ర సృష్టించారని, భారత బృందానికి, సపోర్ట్ స్టాఫ్‌కు తన మెసేజ్‌లో ధోనీ కంగ్రాట్స్ తెలిపాడు.అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఆదివారం రాత్రి న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్ పోరులో న్యూజిలాండ్‌ను 96 పరుగుల తేడాతో మట్టికరిపించి ట్రోఫీని నిలబెట్టుకుంది టీమిండిచా. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్‌కు ఇది వరుసగా రెండో వరల్డ్ కప్ (2024 తర్వాత) కాగా స్వదేశంలో ఈ ట్రోఫీ గెలిచిన మొదటి జట్టుగా రికార్డు సాధించింది. ఫైనల్‌లో సంజూ శాంసన్ (46 బంతుల్లో 89, 5 ఫోర్లు, 8 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు), అభిషేక్ శర్మ (21 బంతుల్లో 52, 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) విధ్వంసకర మెరుపులతో భారత్.. 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 255 పరుగుల రికార్డు స్కోరు చేసింది. ఛేదనలో బుమ్రా (4/15) పేస్ పదునుకు తోడు అక్షర్ పటేల్ (3/27) స్పిన్ మాయతో కివీస్ 19 ఓవర్లలో 159కే కుప్పకూలింది. టిమ్ సీఫర్ట్ (26 బంతుల్లో 52, 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (35 బంతుల్లో 43, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మినహా మిగిలినవారంతా నిరాశపరిచారు. బుమ్రాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', శాంసన్‌కు(321 పరుగులు) 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ' అవార్డులు దక్కాయి.



# స్విస్ ఓపెన్ నుంచి సింధు ఔట్.. లక్ష్య సేన్ డౌటే..!



ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ఆడలేకపోయిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు (ూ౨ ాఱఅఅస్త్రబ) కీలక నిర్ణయం తీసుకుంది. తీవ్ర భయాందోళన మధ్య దుబాయ్ నుంచి స్వదేశం వచ్చిన సింధు.. స్విస్ ఓపెన్‌లోనూ ఆడకూడదని తీర్మానించుకుంది. మూడు రోజుల దుబాయ్‌లో బిక్కుబిక్కుమంటూ గడిపిన తను.. మానసికంగా, శారీరకంగా సన్నద్ధంగా లేనందునే స్విస్ ఓపెన్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్లు పేర్కొంది.సింధు బ్యాడ్మింటన్ కోచింగ్‌పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా దుబాయ్‌లో చిక్కుకున్న పీవీ సింధు ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు దూరమైంది. మూడు రోజుల తర్వాత స్వదేశం చేరుకున్న తెలుగు తేజం ఇంకా కుదురుకోలేదు. దాంతో.. వెంటనే కోర్టులోకి దిగేందుకు ఆమె సిద్ధంగా లేదు. సో.. స్విట్జర్‌లాండ్ ఓపెన్ టోర్నమెంట్ నుంచి వైదొలగాలని సింధు నిర్ణయించుకుంది.అవుట్ డోర్ గేమ్స్ రెండోసారి కూడా ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో కంగుతిన్న లక్ష్య సేన్(ఝఎంష్ట్రఝ ాවఅ) సైతం ఈ పోటీల్లో ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. మార్చి 10 నుంచి మొదలయ్యే ఈ ఈవెంట్‌కు తాను అందుబాటులో ఉండదని ఆమె తెలిపింది. స్విట్జర్‌లాండ్‌లోని సెయింట్ జకొబ్‌షల్లేలో మార్చి 10వ తేదీ నుంచి మార్చి 15 వరకూ స్విస్ ఓపెన్ జరుగనుంది.


# భారత వరల్డ్‌కప్ కోచ్‌ను పట్టేసిన శ్రీలంక.. గెలుపు బాట తొక్కిస్తాడా..!

పొట్టి ప్రపంచకప్‌లో సూపర్ 8 దశలోనే నిష్క్రమించిన శ్రీలంక వన్డే ప్రపంచకప్‌పై గురి పెట్టింది. స్వదేశంలో చెత్త ఆటతో నిరాశపరిచిన లంకను గాడీలో పెట్టేందుకు గ్యారీ కిరెస్టెన్(+ఝతీఎ ఖఱతీర్వఅ)ను ఆశ్రయించింది ఆ దేశ బోర్డు. అనుభవజ్ఞుడైన ఈ దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడిని రెండేళ్ల కాలానికి ప్రధాన కోచ్‌గా నియమించింది శ్రీలంక క్రికెట్. సనత్ జయసూర్య (ఝఅథ్ష్ట్ర జీఝఝంబతీఅఝ) స్థానాన్ని కిర్‌స్టెన్ భర్తీ చేయనున్నాడు. సుదీర్ఘ అనుభవమున్న గ్యారీ ఏప్రిల్ నుంచి లంక కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు.


రెండేళ్ల కిత్రం టీ20 ప్రపంచకప్ వైఫల్యాన్ని సొంతగడ్డపై కొనసాగించిన శ్రీలంక సూపర్ 8లోనే ఇంటిదారి పట్టింది. వరల్డ్‌కప్ హీరో, మాజీ ఆటగాడు సనత్ జయసూర్య కోచింగ్‌లో ఏడాది కాలంగా గొప్పగా ఆడిన లంక.. వరల్డ్‌కప్‌లో మాత్రం తేలిపోయింది. స్వదేశంలోనూ చతికిలపడిన లంకకు కోచ్‌గా ఉండలేనని జయసూర్య వైదిలిగాడు. అతడి రాజీనామాతో కొత్త కోచ్ వేటను మొదలెట్టిన శ్రీలంక క్రికెట్ అనుభవజ్ఞుడైన గ్యారీ కిర్‌స్టెన్‌ను తదుపరి కోచ్‌గా నియమించింది. రెండేళ్ల కాంట్రాక్ట్‌లో భాగంగా ఏప్రిల్ 15వ తేదీ నుంచి అతడు కోచ్‌గా సేవలందించనున్నాడు.

కోచ్‌గా ఘనతలు..

ఆటగాడిగా విజయవంతమైన కిర్‌స్టెన్ కోచ్‌గానూ గొప్పగా రాణించాడు. 2011లో భారత జట్టు వన్డే వరల్డ్‌కప్ విజయంతో కీలకమైన గ్యారీ.. ఆపై ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ (+బయిఝతీఫ్ ుఝఅం) జట్టును అరంగేట్రంలోనే ఛాంపియన్‌గా నిలిపాడు. అనంతరం పాకిస్థాన్ జట్టుకు కొన్నిరోజులు కోచ్‌గా సేవలందించిన అతడు.. పొట్టి వరల్డ్‌కప్‌లో నమీబియా జట్టుకు కన్సల్టెంట్‌గా పని చేశాడు. వచ్చే ఏడాది వరల్డ్‌కప్ పోటీలకు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యమిస్తున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయంగా101 టెస్టులు, 185 వన్డేల్లో దక్షిణాఫ్రికాకు కిర్‌స్టెన్ ప్రాతినిధ్యం వహించాడు.



సాక్షిత
తెలుగు దినపత్రిక



## అదే నా లైఫ్ యాంబిషన్

'అల్లు అర్జున్‌తో కలిసి నటించడం నా డ్రీమ్. ఆయనతో చిన్న రోల్ అయినా చేయడానికి నాకెలాంటి అభ్యంతరం లేదు' అంటున్నది ఢిల్లీ భామ రితికా నాయక్. 'అశోకవనంలో అర్జున కల్యాణం' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న ఈ వయ్యారి, 'మిరాయి'తో స్టార్ ఇమేజ్‌ని సొంతం చేసుకుంది.ప్రస్తుతం ఆనంద్ దేవరకొండ 'డ్యూయెట్'లోనూ, వరుణ్‌తేజ్ 'కొరియన్ కనకరాజు' చిత్రంలోనూ నటిస్తూ బిజీగా ఉన్నది రితికా నాయక్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'సినిమాల్లోకి రావాలని నేనెన్నడూ అనుకోలేదు. ఢిల్లీలోనే నా హయ్యర్ ఎడ్యుకేషన్ పూర్తయింది. ఏదైనా జాబ్ చూసుకుందాం అనుకున్నా. కానీ ఫ్రెండ్స్ బలవంతం పెట్టడంతో తప్పక 'ఢిల్లీ టైమ్స్ ఫ్రెష్ ఫేస్' 12 సీజన్‌లో పాల్గొన్నా. ఊహించని విధంగా ఆ కాంటెస్ట్‌లో విజేతగా నిలిచా. అక్కడ్నుంచి నా ఆలోచనా విధానమే మారిపోయింది. ఎవరు ఆడిషన్స్‌కి పిలిచినా వెళ్లేదాన్ని. చివరికి 'అశోకవనంలో అర్జున కల్యాణం'తో హీరోయిన్‌గా మారాను. తొలి సినిమాకే బెస్ట్ డెబ్యూగా సైమా అవార్డు రావడంతో చెప్పలేనంత ఆనందం అనిపించింది. ఇక 'మిరాయి' నిజంగా నా లైఫ్‌లో ఓ మిరాకిలే. ఈ సినిమా పుణ్యమా అని హిందీ ఆఫర్లు కూడా వస్తున్నాయి. ఏదేమైనా నా లైఫ్ యాంబిషన్ మాత్రం ఒకటే.. బన్నీతో కలిసి నటించాలి' అని అందం గా నవ్వేసింది రితికా నాయక్.

## పాత్ర కోసం చైతూ అంకితభావం

అగ్ర హీరో నాగచైతన్య రాబోతున్న సినిమా 'వృషకర్మ'. మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'విరూపాక్ష'ఫేం కార్తీక్ దండు దర్శకుడు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి ఎస్వీసీసీ అధినేత బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ప్రచారంలో భాగం గా విడుదల చేసిన ప్రచార చిత్రాలకు అద్భుతమైన స్పందన వస్తున్నదని చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో గురువారం హీరో నాగచైతన్యకు సంబంధించిన రెండు స్టిల్స్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇందులో పాత్ర కోసం కఠినమైన వ్యాయామం చేస్తూ దృఢకాయుడిగా కనిపిస్తున్న స్టిల్ ఒకటైతే.. గాయాలతో, యుద్ధానికి సిద్ధమైన యోధుడిగా కనిపిస్తున్న స్టిల్ మరొకటి. ఈ సినిమాలో చైతూ పోషిస్తున్న పాత్ర పేరు అర్జున్. ఆ పాత్ర స్వభావాన్ని సహజంగా ఆవిష్కరించేందుకు నాగచైతన్య చూపిస్తున్న అంకితభావానికి నిదర్శనం ఈ స్టిల్స్ అని మేకర్స్ చెబుతున్నారు. మైథలాజికల్, యాక్షన్ అంశాల మేలుకలయికగా ఈ సినిమా రూపొందుతున్నదని, తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక ప్రాంతాల థియేట్రికల్ హక్కులను సుమారు 45కోట్లకు సితార సంస్థ సొంతం చేసుకున్నదని మేకర్స్ తెలిపారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో స్పర్శ్ శ్రీవాస్తవ, జయరామ్ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: రాగుల్ డి. హెరియన్, సంగీతం: అజనీష్ బి. లోక్‌నాథ్, సమర్పణ: బాపినీడు.





## దుష్ప్రచారాన్ని ఇకపై సహించను!

### సోషల్‌మీడియా తప్పుడు కథనాలపై రష్మిక ఆగ్రహం

సామాజిక మాధ్యమాల ద్వారా తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై అగ్ర కథానాయిక రష్మిక మందన్న ఆగ్రహం వ్యక్తం చేసింది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై తీవ్రంగా మండిపడింది. వారికి హెచ్చరికలు జారీ చేస్తూ గురువారం ఓ లేఖను విడుదల చేసింది. గత ఎనిమిదేళ్లుగా తనపై దుష్ప్రచారం చేస్తూ వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఇన్నాళ్లు ఓపికతో భరించానని, ఇకపై ఇలాంటి చర్యల్ని ఏమాత్రం ఉపేక్షించేది లేదంటూ హెచ్చరించింది. '8ఏండ్ల కిందటి ఓ ప్రైవేటు సంభాషణలోని కొంత భాగాన్ని ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తూ నా వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. నేను ఎన్నడూ అనని పదాలను వండివార్చి నాపై అబద్ధపు కథనాలను రాస్తున్నారు. నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా గడిచిన 24గంటల్లో నాపై తీవ్రమైన దుష్ప్రచారం జరిగింది. ఇది ముమ్మాటికీ నా పరువుపై, నా వ్యక్తిగత గోప్యతపై జరుగుతున్న దాడిగానే నేను భావిస్తున్నా. నా జీవితం నాది. దానిపై నిర్ణయాధికారాలు కూడా నావే. నా జీవితం ఎలా ఉండాలో మీరెలా నిర్ణయిస్తారు? ఇన్నాళ్లూ భరించాను. ఇక మౌనంగా ఉండలేను. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, కొన్ని మీడియా సంస్థలకు 24గంటల సమయం ఇస్తున్నా. నాపై రాసిన తప్పుడు కథనాలను వెంటనే తొలగించాలి. లేని పక్షంలో సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాను. కోర్ట్ నోటీసులు జారీ చేస్తాను' అంటూ ఘాటుగా స్పందించింది రష్మిక మందన్న.

Printed,Published and Owned by : **K.MANJULATHA / EDITOR : BEERAM TEJOMURTHY PRINTED AT : SREE SESHA SAI ENTERPRISES,**plot no-19,ida,balanagar PUBLISHED AT PLOT NO-128 B, gajularamaram, shapurnagar, suraram, medchal district, ts-500055. RNI NO - TELTEL/2017/73751. CELL NO : 9912188899. EMAIL : sakshithanews@gmail.co